ఈ వారం కథ

# కువైట్ సావిత్రమ్మ

సావిత్రమ్మ, కొడుకూ, కూతురికీ ఇద్దరికీ ఒకేరోజు ముహూర్తాలు నిర్ణయించి ఘనంగా పెండ్లి జరిపించింది. ఆ పెండ్లి గురించి చుట్టుపక్కల నాలుగు గ్రామాల వాళ్లూ ఘనంగా చెప్పుకున్నారు. ఇంతవరకూ ఆ వైపు అంత గొప్పగా పెండ్లి జరిపిన వారే లేరని కీర్తించారు.

"ఆహా... దేశం కాని దేశానికి పోయి, సిగ్గూశరమూ లేకుండా అయి పుట్టినోడి కిందల్లా కొంగు పరిచి సంపాయిచ్చి, తగుదునమ్మా అంటూ ముదరపెట్టి ముదరపెట్టి ముసిలోళ్లను చేసినాక బిడ్డలకు పెండ్లి చేసింది, అదీ గొప్పేనా" అని పెదవి విరచి మాట్లాడిన ఇల్లాళ్ళు వున్నారు!


"కడుపు నిండా కూడుపెట్టి లడ్డూ, కారాలూ చేసుకున్న పలారాలన్నీ కొరవ లేకుండా పెట్టించింది సాయిత్రమ్మ, పనీ బాటోళ్లను మరిసిపోకుండా చూసింది. నా తల్లి. ఈ చుట్టు పక్కల ఏ పెద్ద రైతన్నా ఇట్టా పెండ్లి కూడు పెట్టె వోళ్ళుండారంటమ్మే! పొద్దిట్నించీ మాయిటాల్దాకా పెండ్లింటి ముందు కూకపెట్టి ఆకిరికి అంతా అయిపోనిచ్చి అడుగుబుడుగు ఊడిచేసింది పిలుం కూడు - చారు నీళ్లు మన మొకాన పోస్తారు. ఇట్టా మన సాయిత్రమ్మ లాగా ఎవురన్నా మంచి కూడుగానీ, పలారాలు గానీ పెట్టినోల్లుండారా!" అని మాలపల్లి ఆడోళ్ళు సాయిత్రమ్మను గురించి మరీ మరీ పొగుడుకుంటూ చర్చించుకుంటున్నారు.

సావిత్రమ్మను అందరూ "కువైట్ సావిత్రమ్మ" అని పిలుస్తారు. "కువైట్" అనేది ఇంటి పేరుగా మారడానికీ, ఆమె ఆ ప్రాంతానికంతటికి మొదటి సారిగా డబ్బులు సంపాదించుకోవడానికి కువైట్ వెళ్లడమే కారణం. అప్పటి నుండీ ఆమెను "కువైట్ - సావిత్రమ్మా!" అని పిలవడం అలవాటయింది.

* * *

"ఇప్పుడు గనక తన భర్త వుండి వుంటే, కొడుకూ, కూతురికీ ఇంత ఘనంగా పెండ్లి జరిగినందుకు ఎంత సంతోషపడునో ... అయినా ... నా పిచ్చిగాని, ఆయన వుంటే నేను కువైట్‌కు ఎందుకు పోదును, కష్టమో - సుఖమో ఇక్కడే అందరితోనూ నేనూ వుండేదాన్ని కదా" అనుకొంటూ భర్తను గుర్తుకు తెచ్చుకొని బాధ పడింది.

కొత్తగా కట్టించిన యింటిని తేరిపార చూసింది. ఊరి వాతావరణం మనసులో మెదిలింది. తన భర్తతో కలిసి జీవించిన రోజులు గుర్తుకొచ్చాయి, కన్నీళ్లు కొంగుతో ఒత్తుకుంది. భర్తలేని ఒంటరితనం, ఆయనతో కలసి వుండిన ఈ ఊరులో, ఇంటిలో ఎక్కువ కాలం వుండలేననుకొంది. అందుకే తిరిగి కువైట్‌కు వెళ్లాలని



"చక్రవేణు"

నిర్ణయించుకొంది. అయితే ఈసారి కొడుకు లేకుండా తాను ఒక్కతే పోవాలనుకుంది. తన దగ్గర "ఆజానీసా" వుంది కాబట్టి సంవత్సరానికి ఒక పర్యాయం వచ్చి కొడుకూకోడల్నీ, కూతురూఅల్లుడినీ చూసుకొని వెళ్తూ వుంటే సరిపోతుంది. సావిత్రమ్మ అట్లా ఆలోచిస్తూ నిట్టూర్పు విడిచింది.

కుటుంబాన్ని ఒడ్డుకు చేర్చుకొన్నందుకు, బరువు దించుకొన్నట్లుగా ఊపిరి పీల్చుకొంది.

ఇప్పుడైతే తనను అందరూ ఎంతో మర్యాదగా పలకరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ సహాయం చేయమని కోరుతున్నారు. తమ పిల్లలకు 'వీసా'లు పంపమనీ, పరపతిచ్చి ఆదుకొమ్మని కొందరూ!

"నీ రుణం వుంచుకోములే సాయిత్రమ్మా! మమ్మల్ని కూడా ఒక కంట కనిపెట్టి చూడు, ఆదుకో పుణ్యముంటుందిలే" అని ప్రాధేయపడుతున్నారు.


"వీళ్లమాటలు, పలకరింపులు అంతా మనస్ఫూర్తిగానే చేస్తున్నారా, లేకుంటే నా దగ్గర డబ్బులున్నాయి కాబట్టి గౌరవిస్తున్నారా! మరి వీళ్లంతా ఒకప్పుడు నన్ను ఎంత కించిత్తుగా చూసేవాళ్ళు!"

సావిత్రమ్మ అట్లా ఆలోచిస్తూ వుంటే, నెనకటి రోజుల్లో, తన బతుకులో మర్చిపోలేని సంఘటన గుర్తుకొచ్చింది.

* * *

పేదరికం ఎంత క్రూరమైనదంటే, దాన్నించి తప్పించుకునేందుకు మనుషులు ఎంత క్రూరంగా మారడానికైనా సిద్ధపడేట్టు చేసేంత క్రూరమైనది! ఈ క్రూరత్వానికి తోడు మగవాడి అధికారం ఇంకో ఘోరం! ఆడవాళ్ళ జీవితం ఎంత విషాదాత్మకమో, ఎంత నరకమో ఇక చెప్పాలా?

20-7-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక



ఆ రోజు గురించి తలుచుకుంటే పీడకలలాగా అని పిస్తుంది. అందుకే ఆ రోజును ఎప్పటికీ మర్చిపోదు సావిత్రమ్మ.

ఆ రాత్రి బాగా పొద్దుపోయింది. అందరూ అన్నాలు తినడం పూర్తయింది. రాత్రి పండుకోవడానికి సిద్ధ మయ్యే సమయంలో, యింటి ముందు ఎవరో నిలబడి పిలిస్తే సావిత్రమ్మ బయటకొచ్చి చూసింది.

"'సాయిత్రమ్మా! పెద్దబ్బోళ్లింటికాడ మద్దిచ్చ మంట నిమ్ము రమ్మంటున్నారమ్మో" అని ఊరి పెద్ద చాకలి 'వెంకటయ్య' వచ్చి చెప్పినాడు.

"నేనెప్పుడన్నా మద్దిచ్చాల కాడకు వచ్చినానా ఎంగ టన్నా? కాదు కూడదంటే మా యింటాయన పోతా వుండె, ఇంక ఆయన చచ్చిపోయినాక ఎవరుండారు మా యింట్లో మద్దిచ్చాల కాడకు రాను?" సావిత్రమ్మ చెప్పింది.

"మద్దిచ్చం కాడకు ఇనే దానిక్కాదు సాయిత్రమ్మ, ఆడ మీ ఓల్లే నీ మీద మద్దిచ్చం పెడతన్నారమ్మా. అందుకని గబాన పోయి పిల్చుకోని రాపోరా! అంటే వచ్చినా ను తల్లీ" వెంకటన్న వివరించినాడు.

"నాపైన మద్దిచ్చమా ... దేనికంట, నేనేవ్వుర్నన్నా పాడిసినానా... లేకుంటే ఎవరి కొంపన్నా ముంచినా

చెప్పాడు.

ఆ మద్దిస్తం తనపైన ఎందుకు పెడుతున్నారో సావిత్రమ్మ మనసుకు అర్థమైపోయింది. అయినా పోయి తీరాలి, ఏదైతే అది అవుతుంది, వెళ్ళక తప్పదు అను కొనింది.

"సరేలే నువ్వు పో ఎంగటన్నా, మా యమ్మ కోమిటోళ్లింటి కాడికి వక్కల కోసం పోయింది. ఇంట్లో పిల్లోల్లంతా నిద్దరపోతన్నారు. ఆమె రాంగానే చెప్పేస్తాను నువ్వు పదా."

"ఎందుకులే సాయిత్రమ్మా పెద్దామెను రానిచ్చే పోదాములే! బాగా పొద్దిపోయింది ఒక్కదానివే రాలేవులే అమ్మా!" వెంకటన్నా సౌమ్యంగా చెప్పాడు.

వెంకటయ్య మాట్లాడుతూ వుండగానే, అంతలోనే సావిత్రమ్మ తల్లి లక్ష్మమ్మ అంగడి నుండి వచ్చింది.

"ఏం ఎంగటా ఊర్లో అన్నం పెట్టిచ్చుకునేదయి పోయిందా" లక్ష్మమ్మ వెంకటయ్యను పలకరించింది.

వెంకటయ్య `ఔనని తల వూపి, వచ్చిన సంగతి చెప్పాడు.

రాజమ్మ మద్దిచ్చం సంగతి వినగానే దిగులుగా నిలబడిపోయింది. అప్పటికే తన భర్తమీద మద్దిస్తాలు ఎన్నోసార్లు జరిగాయి. ఈ రోజు మళ్లా ఏది మాట్లాడ

వంటవా ... సరేగాని ఆడెవురూరు వచ్చినారు ఎంగ టన్నా" సావిత్రమ్మ అడిగింది.

"అంతా మీ చుట్టాలే వుండారమ్మా ... పెద్దబ్బి గోరి రామయ్య వుండాడు. మీ మరిది చిన్నబ్బ వుండాడు. సావుకారి నాగయ్యను పిలిపించినారు. ఇంకా . మీ ఓల్లు ఆడోల్లంతా వుండారమ్మ" చాకలి వెంకటయ్య పేర్లన్నీ గుర్తుకు తెచ్చుకుంటూ ఎవరు వచ్చిందీ

తారో, చుట్టాలు పగపట్టినట్టుండారు కదా అనుకొని బాధపడింది.

సావిత్రమ్మ తల్లికి చెప్పేసి వెంకటయ్యతో పాటు పెద్దబ్బగారింటికాడికి బయలుదేరింది ...

పెద్దబ్బగారిల్లంటె తన భర్త పుట్టి పెరిగిన ఇల్లు. తన భర్త తాతగారి పేరు పెద్దబ్బ..

తన 'భర్త తండ్రికి'

కూడా అదే పేరు పెట్టారు. పెద్దబ్బ అని పేరుకు తగినట్టుగానే ఆ గ్రామాని కంతటికీ వారిది చాలా పెద్ద రైతు కుటుంబం. ఊర్లో ఏదైనా ఒక కార్యం జరపాలన్నా, కొత్త వ్యక్తికి ఆశ్రయమివ్వాలన్నా, పంచాయతీ జరపా లన్నా పెద్దబ్బగారి కుటుంబం కల్పించుకోకుండా ఏదీ జరిగేది కాదు, అందుకే ఆ వూరికి వారి పేరున "పెద్దూరు" అని గుర్తింపు పడింది.

తాతగారు పెద్దబ్బగారి హయాంలో జరిగినట్టు మనవడు పెద్దబ్బ పెత్తనం వచ్చేటప్పటికి ఐశ్వర్యం బాగా తగ్గిపోయింది. కొడుకు రాజయ్యగానీ, కోడలు సావిత్రమ్మ గానీ అతని మాటను కాదనకుండా నడుచుకున్నారు.

తండ్రి వ్యాపారం చేస్తానంటే కొడుకు రాజయ్య ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా ఎట్లా ఇష్టముంటె, అట్లా చేయమన్నాడు. తండ్రి వ్యాపారం చేస్తూ వుంటే రాజయ్య శ్రద్ధగా వ్యవసాయం చేయడం సాగించాడు. నాలుగైదేళ్లకు బాకీలన్నీ తీరిపోతాయి కదా అనుకున్నారు. కాని అనుకున్నది తారుమారై తండ్రి హఠాత్తుగా చనిపోవ డంతో అప్పుల వాళ్ళంతా రాజయ్య మీదకు రావడం, విధిలేక భూములమ్మి తండ్రి చేసిన బాకీలు తీర్చడం, దాయాదుల దగ్గర తక్కువ చూపుగా బతకడం ఇష్టం

లేక ఇంటి జాగాతో సహా అన్నగార్లకే ఇచ్చేసి, ప్రక్కనే ఆనుకొని వున్న "దిగనపల్లె"లో ఇల్లు తీసుకొని కాపురం పెట్టాడు. తండ్రి పోయాక సంవత్సరం కూడా తిరగకుండానే 'రాజయ్య' కూడా గుండె నొప్పితో హఠాత్తుగా చనిపోవడం అంతా ఒక కలలాగా జరిగిపోయింది. భర్త రాజయ్య చనిపోయాక, సావిత్రమ్మ కుటుంబానికి ఎవరి ఆదరణ లేక ఒంటరిదయింది. చివరికి ఇల్లు కూడా జరగని పరిస్థితిలో దిక్కులేనిదై పోయింది.

దిగన పల్లెకూ - పెద్దూరికి మధ్యన చిన్న ఒంక మాత్రమే అడ్డముంది. ఒంక దాటుకొని ఊర్లోకి పోయేటప్పటికి పెద్దబ్బ గారింటి కాడ వీధి కరెంటు లైటు కింద జనమంతా గుంపుకూడి, సావిత్రమ్మ కోసమే ఎదురు చూస్తున్నారు.

పెద్దబ్బ గారింటి పందిరి కింద వేసిన పట్టె మంచంపై సావిత్రమ్మ బావగారు "రామయ్య ఒకవైపు, 'షావుకారి నాగయ్య' మరోక వైపు కూర్చున్నారు. వాళ్లకు ఎదురుగా వీధిలో తూర్పు దిక్కు కరెంటు స్తంభం దగ్గర రాతి బండల పైన సావిత్రమ్మ మరిదిగారు "చిన్నబ్బ", ఆయనతో పాటు ఇంకా కొంతమంది మగ వాళ్లు పెద్దలు కూర్చున్నారు.

వీధికి వారగా ఉత్తరం దిక్కున కొందరు, దక్షిణం దిక్కున కొందరు ఆడవాళ్లు కూర్చొని ఉత్సాహంగా చర్చించుకుంటూ గుసగుసలాడుకున్నారు. కొందరేమో ఎవరి వాకిళ్లలో వాళ్లు కూర్చొని జరగబోయే దాని కోసం ఎదురు చూస్తున్నారు. 'సావిత్రమ్మ' అక్కడికి రాగానే అందరూ ఒక్కసారిగా మాట్లాడ్డం ఆపారు. సావిత్రమ్మ నేరుగా వెళ్లి తన తోడుకోడళ్ళు కూర్చున్న చోటకు వెళ్లింది. సావిత్రమ్మ కూర్చోగానే తోడికోడళ్లు ఇద్దరూ దూరంగా జరిగిపోయారు. సావిత్రమ్మ ఒక్కతే నేరం చేసిన దానిలాగా బోనులో వున్న తీరుగా కూర్చుంది.

షావుకారు నాగయ్య సావిత్రమ్మను కళ్లద్దాల్లోంచి తేరిపార చూసి "ఒరే చిన్నబ్బా ... మరి మీ వదిన వచ్చింది" అన్నాడు.

నాగయ్య మాట పూర్తిగాక ముందే చిన్నబ్బ అభ్యంతరం చెప్పాడు. "మామా ఇంకోసారి ఆ మాటనగాకు, అది నాకు వదిన కాదు! మా అన్న చచ్చిన రోజే అది నాకు వదిన కాకుండా పోయింది" మరిది చిన్నబ్బ గట్టిగా అరిచాడు. జనాలందరిలోనూ మరింత గుసగుసలు మొదలయ్యాయి.

"అవును నిజమేకదా! వాడన్న వుండివుంటే నేను వదిన, అన్న చచ్చినాడు కాబట్టే, నెల కూడా తిరగక ముందే నన్ను బెదిరించి బలవంతంగా వెడిచినోడికి నేను వదిన నెట్టవుతానులే!" సావిత్రమ్మ మనసులోనే గొనిగింది.

"నువ్వు అనకున్నా, మేము అట్లా అనాల్సిందే కదరా!... సరేలే ఆమె వచ్చింది మరి ... నువ్వేదో చెప్పాలంటివి కదా చెప్పు" నాగయ్య మధ్యస్తం ప్రారంభించాడు.

నాగయ్య మధ్యస్త జరుపుతున్నాడంటే "జిత్తులమారి నక్క పంచాయితీ పెట్టింది" అనేది ఆ గ్రామంలో ప్రతీతి. అందుకే జనంలో నుండి "చెప్పు నాయనా - నక్క తీర్పు, చెప్పు" అన్నారు.

"ఏమిరా చిన్నబ్బా. కానీ మరి" నాగయ్య అన్నాడు.

"నన్నడిగేదే ముందాది మామా! అది చేసేపని, మమ్మల్ని నలుగుర్లో తలెత్తు కోకుండా చేస్తాంది. ఊర్లో ఎవురు పట్టినా దీని మాటే చెపుతా, మమ్మల్నీ, మా కుటుంబాన్నీ నవ్వులపాలు చేస్తన్నాది. ఆ సంగతి అందరికీ తెలుసు కదా!"

చిన్నబ్బ ఆవేశంతో రొప్పుతూ అరిచాడు.

"ఒరే చిన్నబ్బా అరిస్తే పొయ్యేది మన పరువేరా! దానికేమి సిగ్గా, మానం అనేది వుండేది కదా!" సావిత్రమ్మ బావగారు రామయ్య ఎత్తి పొడుపుగా అన్నాడు.

"ఏమిరా చిన్నబ్బా, ఆయమ్మి సంగతి ఏం చెబుతావో చెప్పేసెయ్, ఈ పొద్దు ఏదో ఒకటి తేలాల"

రామయ్య గట్టిగా అరిచాడు.

"నేనే చెప్పాల్నా నువ్వు చెప్పకూడదా!" అంటూ చిన్నబ్బ అన్ననే చెప్పమన్నాడు.

"కడుపు చించుకుంటే కాళ్లకాడ పడ్తాదని, ఆపాడు మాటలన్నీ పెద్దోడు, దరమాత్తుడు నోటి బడితా ఎందుకులే, నువ్వే చెప్పరా అబ్బా"

ముందుగానే అనుకున్న పథకాన్ని గుర్తుచేశాడు నాగయ్య.

అనుకున్న పథకం ప్రకారం ఏదో ఒకటి తొందరగా తేల్చాలి లేకుంటే మధ్యస్త తారుమారౌతుందని 'చిన్నబ్బ గ్రహించి చెప్పడం ప్రారంభించాడు.

"మామా, ఊర్లో యిన్ని రోజులా ఇది, ఎవురెవురితోనో ఎభిచారం చేసింది. ఎన్నిసార్లో కొట్టినాం, తిట్టినాం. అయినా మానుకోలా. నలుగుర్లో మా పరువు తీసింది. ఇప్పుడు అక్కడెక్కడి నుంచో కువైట్‌కు పోయి ఒక      నా కొడుకు వచ్చి వున్నాడు. ఈళ్లమ్మగారి పూరంట రహమాన్ అంట, ఆ      డితో కులకతా వుండింది. మా వంశాన్ని నాశనం చేయడానికే ఇది మా యింటికొచ్చింది."

చిన్నబ్బ ఆవేశంతో రొప్పుతూ అసలు విషయం బయటపెట్టాడు.

"ఏమమ్మే, వాడు చిన్నబ్బ చెప్పేది నిజమేనా!" నాగయ్య సావిత్రమ్మను విచారించాడు.

"ఏందయ్యా, దాన్నిచారించేది. అది ఈ వూళ్ళో వుంటే మా పిల్లోళ్లకు పెండ్లిళ్లు కూడా కాకుండా, దాని బతుకును ఏలెత్తిచూపుతారు. ఉంటే వూర్లో అదన్నా వుండాల, లేకుంటే మేమన్నా వూరొదిలి పోవాల. అంతే ఏదో ఒకటి తేల్చాలి ఈ రోజు."

రామయ్య తమ్ముని మాటలకు జత కలిపి అరిచాడు.

సావిత్రమ్మకు కళ్ళల్లో నీళ్ళు ఉబికి జలజలా రాలి పోతుంటే మౌనంగా రోదిస్తూ కూర్చుంది. జనంలో మరలా శబ్దం మొదలైంది.

"ఏం సావిత్రమ్మా తలొంచుకొని ఏడిసేదెందుకు ఈడందరూ పతివర్తలైపోయి, లోకానికి విరుద్ధంగా నువ్వు ఒక్కదానివే ఎభిచారం చెయిలేదులే. ముసుగులో కనపడకుండా చేస్తే అందరూ పతివర్తలే, ముసుగుతీసితే అందరి గుట్టు ఎత్తిపోసినంతుంటాది. నీకేం భయం లేదు. నువ్వు చెప్పాలనుకొనేదేదో తెగేసి చెప్పేయ్."

మేమందరం నీకు మద్దతుగా వున్నాము, ఫరవా లేదన్నట్లు, చెంగన్న ధైర్యం చెప్పి, సావిత్రమ్మను మాట్లాడమనింది.

"ఏమమ్మే! వాళ్లు చెబుతా వుండేది యినపడతా వుండాది కదా! గమ్మున మూగెద్దులాగా వుంటే ఎట్ట ఏం చెబుతావో చెప్పు."

నాగయ్య గట్టిగా దబాయించినట్టు అన్నాడు.

"ఏముండాదని చెప్పేదన్నా! బలమున్నోళ్లది, నోరున్నోళ్లది చెల్లుబాటవుతాది. మీరంతా వాళ్ల దిక్కు మాట్లాడేదానికి వచ్చినారే గాని, నా మాట కూడ పట్టించుకొని న్యాయం చెప్పాలనుందారా!"

సావిత్రమ్మ ఏడుస్తూనే మాట్లాడతా వుండాది. కొద్దిసేపు అందరూ నిశ్శబ్దంగా వుండిపోయారు. సావిత్రమ్మ చెప్పడం మొదలుపెట్టింది. అందరూ సావిత్రమ్మను సానుభూతితో చూస్తూ వింటున్నారు.

"ఈళ్ల కందరికీ నేనేదో తలతీసేసినట్టు, లోకానికి విరుద్ధంగా నేనొక్కదాన్నే కాని పని చేస్తా వున్నట్టు మాట్లాడతున్నారే. ఇన్ని రోజులూ ఈళ్లెవురన్నా మమ్మల్ని ఆదుకున్నారా? మా యింటాయన పోయి నాక, పాపం బిడ్డల గల్లదే అని విచారించి, ఒక పూటకు అన్నానికి సేరు గింజలు గానీ, ఒక రూపాయి డబ్బు గానీ యిచ్చినోళ్లున్నారా? చెప్పమనండి చూద్దాం? సిగ్గు - మానం లేని బతుకంటున్నారే, అది నా పిల్లోళ్లను కాపాడుకొనే దానికే చేస్తున్నాగాని, ఒళ్లు బలిసి కొవ్వెక్కి చెయ్యలేదు. కూలికిపోయో, నాలికిపోయో నా బిడ్డలూ, నేనూ పస్తులుంటున్నామో, తింటున్నామో నా కొంపలో నేను పడున్నాను. ఎట్లనో నా బతుకు నేను బతికితే వీళ్లకేం బాధ.

ఇప్పుడు ఆ కొంప కూడా లేకుండా తరిమికొట్టా

పద్దెనిమిదవ శతాబ్దపు అప్పు పత్రం ఎలా వుంటుందో వూహించగలరా? 8 1/2 " పొడవు, 1/2 అంగుళం వెడల్పు గల రెండాకుల తాళ పత్రంపై వ్రాయబడిన ఆ అప్పు పత్రం బ్రిటిషు మ్యూజియంలో భద్రంగా వుంది. ఆ అప్పుల పత్రంలోని భాషను తెలుసుకోండి గానీ - అనుకరించారో అప్పు పుట్టదు సుమా—

"యువనామ సంవత్సరం జ్యేష్ఠ బహుళ శ్రీమ తుమేస్తరు గేమునన్ పెండ్లాం మాజిమగార్కి కొళంబ్బాకం కేసువయ కుమారుండు చిన వెంక్కటపతి యిచ్చిన అప్పు పత్రం యీ విదానమా అవసర నిమిత్తమై మీచాత అప్పు పుచ్చుకున్న చెల్లుబడి చెంన్నపట్లం కొత్త గగ (New Madras Pagodas) అక్షరాలా చెంన్నపట్నం కొత్త వరహాలు ఆరు యిందుక్కు వడ్డినెగ్కి వరహాలు ......"

— ద్వా.నా.శాస్త్రి

అంటున్నారు. సరే అట్లనే కానీండి. నా బిడ్డలూ, నేనూ వూరొదిలి పోతాము, వాళ్లనే నా బతుకు కూడా బతికి రాజ్యమేలుకోమనండి.''

సావిత్రమ్మ గబగబ ఆ మాటలనేసి, ఏడుస్తూనే తిరిగి వెనక్కి చూడకుండా పరుగెత్తుకొని ఇంటి కొచ్చింది.

తల్లికి జరిగినదంతా చెప్పింది. అదే రోజు తెల్లవారు ఝామున పాసింజరు రైలులో తల్లితో పాటు బిడ్డల్ని తీసుకొని పుట్టినూరుకు చేరుకొనింది.

పుట్టినింటి తరువాత బంధువుల సహాయంతో రహిమాన్ సాహెబ్ అండదండలతో అతనితో కలిసి కువైట్‌కి బయలుదేరిపోయింది. డబ్బులు బాగా సంపాదించి, ఇన్నాళ్లకు మరలా ఒక ఆస్తిపరురాలుగా భర్త వూరిలో కాలు పెట్టడం, పోయిన ప్రతిష్ట మరలా రావడం, అంతా విచిత్రంగా వుంది సావిత్రమ్మకు.

సావిత్రమ్మ మిద్దె వరండాలో మంచంపైన మేను వాల్చి గతాన్ని ఆలోచిస్తా వుంటే, అంతా ఆశ్చర్యంగానే వుంది. తనను ఈసడించి తరిమికొట్టిన బంధువులంతా ఇప్పుడు గౌరవించడం చూస్తే, వాళ్లది నటనే కానీ గౌరవం కాదని తెలుసుకొంది... ఎవరో వస్తున్నట్లు అలికిడైతే తలతిప్పి చూసింది.

మరిది చిన్నబ్బ, చిన్నబ్బ భార్య రామలక్ష్మమ్మ వచ్చి పిల్చేటప్పటికి, ఆలోచనల నుండి తేరుకొని లేచి కూర్చుంది.

"భోజనానికి రమ్మని చెప్పి పంపితే రాకుండా, ఏడుస్తా కూకున్నావా! అక్కా! ... అయినా ఆడబిడ్డను ఎన్ని రోజులు సాకినా అత్తగారింటికి పోయే వాళ్లేగాని, మనింట్లో వుంటారా'' రామలక్ష్మమ్మ అక్కకు ఓదార్పు చెబుతున్నట్టు చెప్పింది.

సావిత్రమ్మ దుఃఖించేది బిడ్డను అత్తగారింటికి సాగనంపినందుక్కాదని, సాటి బంధువులైన తన వాళ్లే తనను అవమానపరచి, వూరెళ్ళగొట్టారని, గతాన్ని తల్చుకొని కళ్లల్లో నీరు కార్చిందని తోడికోడలు రామలక్ష్మమ్మ వూహించలేకపోయింది.

గతంలో వేర్లు పోక మునుపు కూడాగా వున్నప్పుడు కూడా తోడికోడలు రామలక్ష్మమ్మ తనతో వ్యతిరేకంగా వుండింది కాదు. అయితే మరిది చిన్నబ్బ చేసిన కట్టుదిట్టానికి భయపడి తనతో సన్నిహితంగా వుండేది కాదు. ఆ విషయం సావిత్రమ్మ ముందు నుంచి కూడా అర్థం చేసుకొన్నందువల్లనే, రామలక్ష్మమ్మ పట్ల అభిమానంగా వుండేది.

"పోదాం పదక్కా అన్నం తినేపొద్దువు'' రామలక్ష్మమ్మ అక్కను బతిమాలింది.

"ఎందుకులే రామలక్ష్మమ్మ నేను కూడా అన్నం చేసిపెట్టినా'' సావిత్రమ్మ జవాబిచ్చింది.

ఎంతసేపు రామలక్ష్మమ్మ మాట్లాడుతుందేగాని, చిన్నబ్బ మాత్రం, సావిత్రమ్మతో ముఖాముఖి మాట్లాడలేదు. గతంలో అతని ప్రవర్తన గుర్తుకు తెచ్చుకొని తలవంచుకొని నిలబడ్డాడు. సావిత్రమ్మ కూడా మరిది విషయాన్ని గమనించింది, అయినా పలకరించకుండానే వుండిపోయింది.

"ఈ వారంలోనే కోనేటికి పోతన్నానన్నారు నిజమేనా అక్కా.''

> ప్రతి కళాకారుడూ యింతో అంతో పొగడ్తకు నోచుకోక పోతే తన కళా సృష్టిలో ముందుకు పోలేడు. ఈ పొగడ్త తేనె టీగల నించి వస్తే పూచీ లేదు. అదే జోరీగలా వస్తే భరించలేక తనే యింకొకరి నోటిలో ఆ తేనెను పోసో, లేక తనను తాను పొగుడుకుంటేనో గానీ తన కళాసృష్టికి శక్తిని సంపాదించలేడు.
>
> — బలివాడ కాంతారావు

"అవునమ్మో! పెళ్లికోసమని నిలబడినా గాని, లేకుంటే ఈ పాటికే పోయుండాల్సింది. వచ్చే ఆదివారం జనతా ఎక్స్‌ప్రెస్‌లో బొంబాయికి పోయి, అడ్నుంచి కోనేటికి పోతాను'' సావిత్రమ్మ ఏ మాత్రం కోపం లేకుండా మాట్లాడింది.

కొద్దిసేపు అందరి మధ్యన నిశ్శబ్దం ఏర్పడింది. వచ్చిన పని గుర్తుచేస్తూ, భార్యను 'అసలు విషయం మాట్లాడు' అని సైగ ద్వారా చెప్పాడు.

"మీ మరిది కూడా కోనేటికి రావాలంటున్నాడు అక్కా.''

రామలక్ష్మమ్మ నసుగుతూ భర్త గురించి చెప్పింది.

తన దగ్గర 'వీసా'లు ఏమన్నా వున్నాయని, వాటిని విచారించుకోవడానికే వచ్చినారని సావిత్రమ్మ గుర్తించింది.

"నేను ఈసారి ఈసాలు తీసక రాలేదమ్మో, పెండ్లి విషయంలోపడి తొందరగా వచ్చేసినాను. ఒకేల రహిమాన్ మామ గనక తెచ్చుంటే అడిగి చెబుతాను'' సావిత్రమ్మ వివరించి చెప్పింది.

"రహిమానన్నను అడిగితే మొగోళ్లకు తేలేదు. ఆడోళ్లకు కావాలంటే వీసాలు తెచ్చినామని చెప్పినాడు వదినా!''

ఎట్టకేలకు చిన్నబ్బ వదినతో మాట్లాడాడు. కాని సావిత్రమ్మ మాత్రం అతని మాటలకు జవాబివ్వకుండా వుండిపోయింది.

ఒకప్పుడు రహిమాన్ సాహెబ్‌ను, తనను యింట్లో నేసి అగ్గిపెడతానని గలాటా చేసిన చిన్నబ్బ, ఈ రోజు 'రహిమానన్న'' అని అనడం సావిత్రమ్మకు ఆశ్చర్యం అనిపించింది.

"మొగోళ్లకు ఈసాలు తేలేదుకదా, అందుకని మీ మరిది నన్ను పంపించాలంటన్నాడక్కా ... నువ్వు రమ్మంటే వస్తానక్కా ...!! రామలక్ష్మమ్మ ప్రాధేయ పడ్తున్నట్లుగా అడిగింది.

"నాదేముందాది ... రహిమాన్ మామ రమ్మనంటే అట్లే రండి ... కానీ అక్కడ చానా యిబ్బందులుంటాయి. వాటిని ఓర్చుకొంటామనేటుగా వుంటేనే రావాల. ఒకేల వచ్చినాక అక్కడి పనులు చెయలేమనుకుంటే మీకే నష్టం ... అందుకని ముందుగానే ఆలోచించుకోండి.''

సావిత్రమ్మ, తోటికోడలుకే కాకుండా మరిది కూడా వినాలని గట్టిగా చెప్పింది.

"నేను చేను కాడికి పోయ్యే సొస్తా''

చిన్నబ్బ భార్యతో అనేసి వెళ్లిపోయాడు. సావిత్రమ్మ, రామలక్ష్మమ్మ ఇద్దరూ ఏం మాట్లాడకుండా కొద్దిసేపు వున్నారు. తర్వాత సావిత్రమ్మ మాట్లాడింది.

"నేను నేరుగా బొంబాయికి పోతూనే ఎక్కువ రోజులుండకుండానే కోనేటికి పోతాను. నువ్వు నా వెంబడే వచ్చే దానికి వీలుపడదు రామలక్ష్మమ్మా, నీకు బొంబాయిలో డాక్టర్లు పరీచ్చలు చేసి, పాస్ పోటో, ఈసా తనికీ చేసేసినాక అన్నీ రెడీ అయ్యేటప్పటికి సుమారుగా ఎంత లేదన్నా రెండు, మూడు నెల్లన్నా పడతాది'' సావిత్రమ్మ వివరించింది.

"రహిమాన్ మామ కూడా మా యింటాయనతో అదే మాట చెప్పినాడంటక్కా!''

"సరే నీ బడీతా మీ యింటాయన్ను కూడా బొంబాయి దాకా రమ్మన్నాడా, లేకుంటే వద్దులే అన్నాడా?''

"నీకు మల్లా ఖర్చు దేనికి చిన్నబ్బా ... నేను బడీతావుండి నీ భార్యను జాగర్తగా పిల్చకపోతాను కదా, అని రహిమాన్ మామ చెప్పినాడటక్కా!''

రామలక్ష్మమ్మ అమాయకంగా చెపుతాంటే సావిత్రమ్మకు ఒక విధమైన సానుభూతి కల్గింది. రామలక్ష్మమ్మకు భర్త ఏమీ చెప్పినట్టుగా లేదనుకొనింది. రహిమాన్ ఉపాయం ఏమిటో కూడా ఆమెకు తెలిసినట్లుగా లేదనుకొనింది.

"కాని రామలక్ష్మమ్మ నీకొక సంగతి చెప్పాలమ్మో! మల్లా ఇదిగో చూడు ఆయక్కయినా ఒక మాటన్నా చెప్పలేదు చూడు అనుకోగాకు ... బొంబాయికి పోయినాక ఎట్టలేదన్నా నీవు రెండు మూడు నెలలు అక్కడే వుండొచ్చు. ఈ రెండు నెలలు, నిన్ను తీసక పోతా వుండారే ఏజెంట్లు, వాళ్ల మర్యాదగా చూస్తారనుకోగాకు. అక్కడ వాళ్లకు కావాల్సిన మొగోళ్ల దగ్గరికల్లా నిన్ను పంపిస్తారు. నేను చెప్పేది మాత్రం అచ్చరాల నిజం. నీకు ఇష్టమున్నా లేకున్నా సరే వాళ్ల చెప్పింది చేయకుండా, మాత్రం కోనేటికి పోలేవు. నీ మీద నాకు దయుండాది కాబట్టే నీకు ఈ సంగతి చెబుతున్నా. ఆడోల్లు కోనేటికి పోతన్నా రంటె అంత సులభంగా పోతన్నారనుకోవద్దు. అందుకని బాగా ఆలోచించుకో.''

సావిత్రమ్మ ఏజంట్ల గుట్టునూ దళారీ తనాన్నీ పూసగుచ్చినట్టు వివరించింది.

సావిత్రమ్మ చెప్పినదంతా విన్నాక, రామలక్ష్మమ్మ బోరుమని ఏడ్చింది.

"మా యింటాయనకు ఆ సంగతులన్నీ తెలిసి కూడా నన్ను పంపిస్తన్నాడక్కా! వాళ్ల ఏమి చెప్పినా నన్ను ఒప్పుకోమ్మని చెప్పినాడు, నేను ఆ మాదిరిగా చేయను, పోనంటె నన్ను పట్టుకొని కొడతన్నాడు. ఇంక ఈ దెబ్బలతో ఇక్కడ చచ్చేదానికన్నా, అడికిపోయి బతకడమే మేలనుకొని ఒప్పుకొనేసినానక్కా!'' రామలక్ష్మమ్మ ఏడుస్తూనే వివరించింది.

"నాకు ఎందనాయిది లేక, బిడ్డల్ని పస్తులు పండుకోమని చెప్పలేక, వాళ్ల తిండి కోసమని, కానికూడని పనికి కక్కుర్తిపడితే, నీ మొగుడు పంచాయతీ పెట్టి వూరెళ్లగొట్టినాడు, ఇప్పుడు విన్నేమో తెలిసికూడా అతనే

ఎభిచారంలోకి దింపుతున్నాడు. దీన్నేమంటారో అడగలేకపోయినావా!"

సావిత్రమ్మ మనసులో అణచుకోలేక అడిగేసింది.

"అన్నీ తెలిసిన దానివి, నువ్వే నన్నడిగితే నేను ఏమి చెప్పాలి అక్కా" రామలక్ష్మమ్మ జవాబిచ్చింది.

"అంతేనమ్మే దండిగా డబ్బులొచ్చేట్టుగా వుంటే, వాళ్ళు, పొలుద్దు పడేది కాకుండా, పెండ్లాలను కూడా అమ్మేస్తారు, నీ మొగుడు లాంటోళ్ళు..."

సావిత్రమ్మ మనసులోని కోపాన్ని బయటకు వెలిబుచ్చింది.

కొద్దిసేపటికి తన కోపాన్ని అణచుకొని మనసును ప్రశాంతతలోకి తెచ్చుకొనింది.

"నేను ఆదివారం రోజు రైలుకు 'జనతా'లో బొంబాయికి వెడతాను. నువ్వు వచ్చేటుగా వుంటే ఆ రోజుకు ముందుగానే టిక్కెట్టు తీసుకోవాలి. కనీసం బొంబాయిలో నీకు తోడుగా పది రోజులన్నా వుంటాను."

సావిత్రమ్మ అన్ని విషయాలు వివరంగా చెప్పినాక రామలక్ష్మమ్మ ఆలోచిస్తూ యింటికి వెళ్ళిపోయింది.

* * *

ఆ రోజు సాయంకాలం బొంబాయికి వెళ్ళే జనతా ఎక్స్‌ప్రెస్ కోసం, కోడూరు రైల్వే స్టేషన్‌లో జనం విపరీతంగా కిక్కిరిసి వున్నారు. సావిత్రమ్మనూ రామలక్ష్మమ్మనూ ట్రైన్ ఎక్కించి వీడ్కోలు చెప్పడానికి కోసం 'పెద్దూరు' జనమంతా కదిలి స్టేషన్‌కు వచ్చారు.

వారానికి ఒకరిద్దరు తప్పకుండా, ఆ స్టేషన్ నుంచి కువైట్‌కు వెళ్ళే ప్రయాణీకులుంటారు. ఆ రోజు చాలా మంది వున్నట్టు వుంది. వారి బంధువులను పట్టుకొని ఏడుస్తున్నారు. "పోతానే ఎట్టెట్ట చేరినావో అన్ని సంగతులూ జాబు రాయి" అని కొందరు హెచ్చరిస్తున్నారు.

ఇంతలోనే పెద్దగా ఏడ్చుకుంటూ కొందరు ప్లాట్ ఫారం పైకి పెద్ద గుంపుగా కదిలి రావడంతో అందరి దృష్టి అటువైపు మళ్ళింది. ఒక ముస్లిం అమ్మాయి, పెండ్లి కూడా కాని పదిహేడు సంవత్సరాల అమ్మాయిని వాళ్ల తల్లి దండ్రులు కువైట్‌కు పంపుతూ వుంటే, ఆ పాప దిక్కులన్నీ దద్దరిల్లేటట్లు శోకాలు తీస్తూ వుంది.

"నీకేం భయం లేదులే బిడ్డా! మీ మామ వెంబడే వస్తల్లా, నీకేం దిగుల్లేకుండా అన్నీ చూసుకుంటాడులే ... రెండు సంవత్సరాలు గట్టిగా వుంటే సాల్, మళ్లి వద్దు వచ్చేసెయ్ బాగా పెండ్లి చేస్తావ్" అంటూ తల్లి బిడ్డకు నచ్చ చెప్పుతూ వుంది.

"పెండ్లికాని పసి బిడ్డను, కాని దేశానికి తరిమి ఆ డబ్బులూ, సంపాదన లేకుంటే ఏమి! ఛీ ... దాని కన్న ఇక్కడే అడుక్కోని బతికినా గౌరవమే!"

"అమ్మా, నాయిన దగ్గరుండి కసాయికి గొడ్డును తోలినట్టు తోల్తున్నారే, మనుషులేనంటయ్యా!!"

చూస్తున్న వాళ్ళు ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు.

రైలు బండి స్టేషన్లోకి రాగానే జనం ఒకరి నొకరు తోసుకొంటూ పెట్టెల దగ్గరకు పరుగు తీశారు.

సావిత్రమ్మ పెట్టెలోకి వెళ్లి తన రిజర్వేషన్ సీట్లో కూర్చుని వుంది. కొడుకూకోడలూ కూతురూఅల్లుడూ బంధువులందరూ వచ్చి వీడ్కోలు చెప్పారు.

రామలక్ష్మమ్మను బంధువులందరూ పట్టుకొని ఏడుస్తున్నారు. చిన్నబ్బ భార్యను వదలలేక వదులుతున్నట్లుగా బాధపడి పోతున్నాడు. పెద్ద వాళ్ళు కొందరు ధైర్యం చెబుతూ వుంటే రైలు కదిలింది.

రహమాన్ సాహెబ్ కంపార్ట్‌మెంట్ డోర్ దగ్గర నిలబడి రామలక్ష్మమ్మను పెట్టెలోకి లాగాడు. కదిలి వెళ్తున్న రైలు శబ్దం కన్నా, ప్లాట్‌ఫారంపై నిల్చొని ఏడుస్తున్న జనం అరుపులే బిగ్గరగా వినిపిస్తూ వుంది.

రైలు కనుమరుగయ్యేంతవరకూ ప్లాట్‌ఫారంపై జనాలు చేయూపుతూనే వున్నారు.

రామలక్ష్మమ్మ కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ వుంటే పెట్టెలోని జనమంతా సానుభూతితో ఆమె వైపే చూస్తున్నారు. ఉన్న వూరినీ, కన్నవారినీ, బంధువుల్నీ వదలాలంటే రామలక్ష్మమ్మకు సాధ్యం కావడం లేదు. అందుకని అంతగా దుఃఖిస్తూ వుంది.

సావిత్రమ్మకు ఆశ్చర్యం కానీ, పెద్దగా బాధకానీ లేదు. తనకు అది మామూలైపోయింది. కళ్లల్లో నీళ్ళు వుబికి అక్కడే ఆగిపోయాయి. మనసంతా భారంగా వుంటే సీట్లో వెనక్కివాలి కూర్చుంది.

సావిత్రమ్మ తాను భరించిన కష్టాల జీవితానుభవం, అవి నేర్పిన పాఠాలూ బతుకు సూత్రాన్ని వడగాచి తెలుసుకున్నట్లుంది. అందుకే కొడుకూ-కోడలూ కూతురూఅల్లుడూ బంధువులంతా కనుమరుగవుతున్నా కళ్ళల్లో కన్నీరు మాత్రం కారలేదు. మనుషులూ మాయలూ-మర్మాల్నీ చదువుతున్నట్లుగా కళ్లు మూసుకుని, విరక్తిగా నవ్వుతూ ఆలోచిస్తూ వుంది సావిత్రమ్మ.

## 60 ఏళ్ళ నాటి మాట



స్వాతంత్ర్య పోరాటంలో అనేకసార్లు జైలుకు వెళ్ళి మహాత్మాగాంధీ, బిపిన్ చంద్రపాల్, విఠల్‌భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య, ఆంధ్రకేసరి ప్రకాశం, నేతాజీ వంటి మహా నాయకులతో సాన్నిహిత్యం కలిగిన శ్రీ మంగళపల్లి రాజేశ్వరరావు ఇప్పుడు విజయవాడ పాత బస్తీలోని ఒక ఇంట్లో వుంటున్నారు. ఆయన ఆరోగ్యం సరిగా లేదు. నేటి రాజకీయాలు పత్రికలలో చదివి ఎంతో ఖేదం అనుభవిస్తాడు. ఏం చేయగలడు? "అసలు ఎవరూ ఏమీ చేయలేని స్థితి. మహాత్మాగాంధి, జవహర్లాల్ నెహ్రూలు తిరిగి బ్రతికి వచ్చినా ఈ దేశంలో ఈనాటి పరిస్థితిని బాగు చేయడం కష్టం. ఎందుకు వచ్చిందా బాబూ అని పారిపోతారు" అని శ్రీ రాజేశ్వరరావు ఆవేదన వెలిబుచ్చారు.

ఆయన 1898 నవంబరు 23న జన్మించారు. 1930లో అంటే అరవై ఏళ్ళ క్రిందట బళ్ళారి క్యాంపు జైలులో జరిగిన ఒక సంఘటనను ఆయన వివరించారు. వృద్ధాప్యం వల్ల యూరోపియన్ సూపరింటెండెంట్ పేరు చెప్పలేకపోయాడు.

"రాజకీయ ఖైదీలు వందల సంఖ్యలో వున్నారు. జైలు సూపరింటెండెంటు యూరోపియన్ రోజువారీ పర్యవేక్షణకు వచ్చారు. శ్రీ కోట సుబ్బారావు (తర్వాత కృష్ణా పత్రికకు కొన్నిసంవత్సరాలు సంపాదకులుగావున్నారు) కడుపు నొప్పి వల్ల లేవలేక కూర్చుండిపోయారట. సూపరింటెండెంట్‌కు కోపం వచ్చింది. శ్రీ సుబ్బారావును దుడ్డు కర్రతో కొట్టాడు. శ్రీ సుబ్బారావు తిరగబడ్డారు. సూపరింటెండెంటు మాప్లాలను మా పైకి ప్రయోగించాడు. అయితే వారంతా సంప్రదించుకుని దేశభక్తులను కొట్టడానికి ముందుకు రాలేదు.

తర్వాత యూరోపియన్ తన ధోరణి మార్చుకున్నారు. మాకు ఏమి కావాలన్నా ఇచ్చేవాడు.

మాప్లాలు కూడా సాయపడేవారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం రాగలదనే ఆకాంక్షను కూడా వెలిబుచ్చాడు" అని శ్రీ రాజేశ్వరరావు ఆ కథను ముగించారు.

"ఆనాడు జైళ్ళు ఎలా వుండేవి?" అన్నాను.

"రాజమండ్రి జైలు నరకం, రాయవెల్లూరు జైలు స్వర్గం" అన్నారు.

"మొదట్లో పులుసు అన్నం మాత్రం పెట్టేవారు. తర్వాత 'ఎ', 'బి', 'సి' క్లాసులు వచ్చాయి. అన్నం, కూర, పప్పు, పులుసు వడ్డించేవారు" అన్నారు.



\- ఎం.ఎస్.ఎం.